క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న యువకులు

కార్వేటినగరం: రాస్ వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ మాట్లాడుతూ ఉద్యోగరీత్యా ఇతరప్రాంతాల్లో స్థిరపడిన స్థానిక యువకులు పండుగనాడు వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేలురెడ్డి, దామోదరరెడ్డి, రమేష్, కిషోర్, భూపాల్ పాల్గొన్నారు.

బాలగురునాథీశ్వరునికి ప్రత్యేక పూజలు


విశేషాలంకారంలో స్వామివారు

పాలసముద్రం: రాచపాళ్యం గ్రామంలోని బాల గురునాథీశ్వరస్వామి ఆలయంలో కనుమ పండుగను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి పాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి అభిషేకించారు. జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. అలాగే నరసింహ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

రాతిచెరువు గంగమ్మకు..


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

కార్వేటినగరం: ఎల్ఆర్ పేట సమీపంలోని రాతి చెరువు గంగమ్మకు కనుమ పండుగను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తఇండ్లు, నాగిరెడ్డి పల్లె నుంచి మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గడ్డివామి దగ్ధం


మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

ఏర్పేడు: గడ్డివామి దగ్ధమైన సంఘటన ఆదివారం మండలంలోని మేర్లపాకలో చోటుచేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన రైతు రవి తమ ఇంటి వద్ద గడ్డివామి వేసుకున్నాడు. ఆదివారం గడ్డివామి మీదుగా పైన ఉన్న విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు రాలడంతో మంటలు రేగాయి. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి అగ్నిమాపక కార్యాలయం నుంచి ఫైరింజన్ అక్కడికి చేరుకునేసరికి గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. రూ.70 వేల ఆస్తినష్టం సంభవించినట్లు బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

వేడుకగా గోపూజ

పిచ్చాటూరు: కనుమ పర్వదినం పురస్కరించుకుని సోమవారం నాగలాపురం మండలం సురుటుపల్లెలోని శ్రీ పళ్లికొండేశ్వరాలయ గోశాలలో గోపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గోశాలను పుష్పాలతో అలంకరించి, గోవులకు రంగులు వేసి, ముస్తాబు చేశారు. అనంతరం కనుమ పొంగలి పొంగించి వైభవంగా గోపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు

నారాయణవనం: సంక్రాంతి సందర్భంగా మంగళవారం పాలమంగళం నార్త్ పాలీశ్వరస్వామి, తుంబూరు తుంబీశ్వరస్వామి ఉత్సవ మూర్తులతో గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సాయిరవి, లక్ష్మయ్య తెలిపారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయం బాలాలయంలో ఉన్న కారణంతో టీటీడీ అనుబంధ శైవక్షేత్రాల ఉత్సవమూర్తులు గిరిప్రదక్షిణలో పాల్గొనవని ఆలయాల అధికారి నాగరాజు తెలిపారు. సంక్రాంతికి మూడవ రోజున టీటీడీ ఆలయాలైన చంపకవల్లీ సమేత పరాశురేశ్వర స్వామి(నారాయణవనం), మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర(సముదాయం), తుంబూరు తుంబీశ్వరస్వామి, పాలమంగళం ఉత్తరపు కండ్రిగ పాలీశ్వరస్వామి ఉత్సవమూర్తులతో పాటు మరో 20 గ్రామా ల్లోని ఆలయాల ఉత్సవర్లకు నగరిలో నిర్వహించే సంధి కార్యక్రమంలో గిరిప్రదక్షిణ ఉత్సవంగా నిర్వహించడం పరిపాటి. సముదాయంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మరమ్మతుల కారణంతో ఉత్సవాన్ని రద్దు చేసినట్లు నాగరాజు తెలిపారు. సంప్రదాయానికి స్వస్తి పలకరాదనే ఉద్దేశంతో తుంబీశ్వరస్వామిని శనివారం ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ పేర్కొంది.

సంబరంగా సంక్రాంతి.. వేడుకగా కనుమ

- గోమాతలకు ప్రత్యేక పూజలు
- మహిళలకు ముగ్గుల పోటీలు

నగరి: నగరి మున్సిపాలిటీతోపాటు మండల ప్రాంతాల్లో ఆదివారం సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నగరి పట్టణంలోని వీధులు రంగవల్లికలతో ముస్తాబయ్యాయి. పెద్దలు, పిల్లలు కొత్త దుస్తులతో కోలాహలంగా కనిపించారు. మహిళలు కొత్త కుండల్లో పొంగళ్లు పెట్టి సూర్యునికి నైవేద్యం సమర్పించారు. సోమవారం పశువుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పశువులను అలంకరించారు. కొత్త గంటలు కట్టి వాటి కొమ్ములకు రంగులు వేశారు. పూలదండలు వేసి హారతులు ఇచ్చి మొక్కుకున్నారు. వీధుల్లో పశువుల వైభవాన్ని తెలిపే ముగ్గులు వేసి పశువుల పట్ల ఉన్న భక్తిని చాటుకున్నారు. కనుమ సందర్భంగా కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో గోపూజ నిర్వహించారు. ఆలయంలో గోవులను పువ్వులతో అలంకరించి పూజలు చేశారు. యువకులు వీధుల్లో ఉట్టి కట్టి వాటిని కొడుతూ సంబరాలు చేసుకున్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 150 మంది పాల్గొని వివిధ ముగ్గులు వేశారు. అమల, కనిమొళి, నదియ, ఓంశక్తి, సంగీత విజేతలుగా నిలిచి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు సాధించారు. వీరికి ఆలయ నిర్వాహకులు జలగండ సుబ్రమణ్యం బహుమతులు అందజేశారు.

గంగాధరనెల్లూరు: మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు ఆదివారం సంబరంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఉల్లాసంగా గడిపారు. పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. సోమవారం కనుమ పండుగను పురస్కరించుకుని పశువులను అలంకరించారు. దొడ్డి ఏర్పాటు చేసి గోపూజ నిర్వహించారు. పలు గ్రామాల్లో కాటమరాజు సన్నిధి వద్ద పొంగళ్లు పొంగించారు.




నగరి: ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు, కార్వేటినగరం : విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్టీయూ నాయకులు, వెదురుకుప్పం: ప్రత్యేక అలంకరణలో కొండమల్లీశుడు

ఈడిగపల్లెలో వివిధ పోటీలు

కార్వేటినగరం: మండలంలోని ఈడిగపల్లెలో ఆదివారం రాత్రి వివిధ పోటీలు నిర్వహించారు. పిల్లలకు మ్యూజికల్ చైర్స్, ఖోఖో, పరుగు పందెం ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందించారు.

ముగ్గుల పోటీ

స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కనుమ పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీ నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర నేతలు గాజుల నాగేశ్వర రావు, హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను రంగవల్లులు ప్రతిబింబిస్తాయన్నారు. కోమల, జ్యోతి, యశస్విని తొలి మూడు బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో మైనారిటీ నేత ఢంకా హమీద్‌బాషా, పీలేరు రూరల్ సీఐ మర్రి తులసీరామ్, ఉపాధ్యాయుడు దేవయ్య, ఎస్టీయూ నాయకులు నాగేంద్రరాజు, రంజిత్‌కుమార్, యువరాజు,చంద్రశేఖర్, పయని, సుబ్రమణ్యం, సర్దార్, శేఖర్, విజయకుమార్‌పిళ్లై, మునిరాజా, డెలీలా, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

బొంతివంకలో పరుష పందేలు

పెనుమూరు (కార్వేటినగరం): బొంతివంక దళిత వాడలో ఆదివారం పరుష పందేలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల బూత్ కమిటీ అధ్యక్షుడు కె.లోకేష్‌రెడ్డి, సర్పంచ్ వాణిశ్రీ పందేలను ప్రారంభించారు. ఎద్లను నిలువరించేందుకు యువత పోటీపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌బాబు, చెన్నకేశవనాయుడు, వాసుదేవరెడ్డి, భూపతి నాయుడు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: కనుమ పండగను పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఆర్ఎన్ కండ్రిగ, చవటగుంట శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బాలుపల్లెలో అమ్మవారి తిరునాళ్లకు ఆదివారం రాత్రి చాటింపు వేశారు.

విజయపురంలో..

విజయపురం: మండలంలో ఆదివారం సంక్రాంతి పండుగ సందర్భంగా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జంబాడలో కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మల్లారెడ్డికండ్రిగ, విజయపురం, పాతర్కాడులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి చీరలు పంపిణీ చేశారు. సోమవారం ఉదయం రైతులు ఆవులకు పూజలు చేశారు.




పాలసముద్రం : సుందరంగా అలంకరించిన కోడెగిత్త, నగరి: కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయం వద్ద పశువులకు పూజలు చేస్తున్న మహిళలు, పోటీల్లో మహిళలు వేసిన ముగ్గులు

నేడు ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీలకు సిద్ధమైన మైదానం

నగరి: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి, కొండచుట్టు ఉత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఈ పోటీలు జరగనున్నాయి. ఉదయం 8.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, పాల్గొనే మహిళలు తమ పేర్లను నగరి మున్సిపాలిటీ, నగరి మండలానికి చెందిన వారు 9642388889, విజయపురం నిండ్ర మండలాలకు చెందిన వారు 9100703665, వడమాపేట, పుత్తూరు మండలాలకు చెందిన వారు 8019999969లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలకు ఆకర్షణీయమైన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వడమాలపేట: మండలంలోని పత్తిపుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సర్పంచ్ తులసీ రవికుమార్‌రెడ్డి అధ్యక్షతన మన ఊరు సేవా ఫౌండేషన్, శుభమస్తు షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచీన ఆచారాలు, సంప్రదాయాలను మరిచి పోకూడదనే ఉద్దేశంతో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ముస్లింల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి: ముస్లిం మైనారిటీలు రూపొందించిన నూతన సంవత్సరపు క్యాలెండర్‌ను ఆదివారం పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా నగరిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ముస్లింలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించడానికి వక్ఫ్‌బోర్డు కీలకంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అహ్మద్ అలీ, నాయకులు జమీర్, సర్దార్, హాషీం తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు నిధులు మంజూరుపై హర్షం


మాట్లాడుతున్న సురేష్ వర్మ

శ్రీరంగరాజపురం: మండలంలోని ఉడమాలకుర్తి గ్రామం వద్ద కుశస్థలి నదిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.27 కోట్లు మంజూరు చేయడంపై వైఎస్సార్ రైతు సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌వర్మ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కృష్ణాపురం జలాశయం గేట్లు ఎత్తితే ప్రవాహ ఉధృతికి గతంలో పలువురు గల్లంతయ్యేవారని వెల్లడించారు. ఈ ప్రాంతంలో వంతెన నిర్మిస్తే నాలుగు మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విషయం విన్నవించి, నిధులు మంజూరు చేయించారన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న జగనన్నకు ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో ప్రజల కల సాకారమైందని వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిట్టి, విజయ, అనిత, ఎంపీటీసీ సభ్యులు ఏసమ్మ, స్థానిక నేతలు మహేష్, ఏకాంబరం, గోవిందయ్య, తోంబయ్య పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న కౌన్సిలర్లు

నగరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన నగరి పట్టణానికి చెందిన టి.సంజయ్, సీఎం .అరుణ్, ఈ.ధనుష్‌ను కౌన్సిలర్లు బీడీ భాస్కర్, బిలాల్ సోమవారం అభినందించారు. వారికి బాల్, నెట్, ఇతర క్రీడా సామగ్రి అందజేశారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

మట్టి దారికి మరమ్మతులు

వెదురుకుప్పం: బ్రాహ్మణపల్లె సచివాలయ పరిధిలోని బండ్ల మీద ఇండ్లకు వెళ్లే దారి అధ్వానంగా ఉండడంతో సర్పంచ్ పోటుగారి లలిత సోమవారం మట్టి తోలించి మరమ్మతు చేయించారు. పనులను వైస్ ఎంపీపీ బట్టె రమణసుబ్రమణ్యం, సామాజిక కార్యకర్త భాస్కర్ పర్యవేక్షించారు.

ఘనంగా కబడ్డీ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

పుత్తూరు రూరల్: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ జయంతిని పురస్కరించుకుని పుత్తూరు మండలం పల్లూరులో ఆదివారం నగరి, సత్యవేడు నియోజకవర్గాల స్థాయిలో సంక్రాంతి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, వార్డు కౌన్సిలర్ సి.గుణశేఖర్, సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. మొత్తం 15 టీములు పాల్గొనగా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 వరకు పోటీలు జరిగాయి. కొత్తతిమ్మాపురం, కొప్పేడు, జీఎస్ కండ్రిగ జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. విజేతలకు ఒక్కొక్కరికి రూ.4 వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేశారు. ప్రతిఏటా ఎంజీఆర్ పేరిట కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజర్ ఎం.సుబ్రమణ్యం తెలిపారు.

పల్లకిపై వేణుగోపాలుడి విహారం


ఉభయ దేవేరులతో వేణుగోపాలుడు

కార్వేటినగరం: కనుమ పండుగను పురస్కరించుకుని సోమవారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అభిషేకాలు జరిపించారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలుడిని వివిధ పుష్పాలు, దివ్యాభరణాలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఉభయ దేవేరుల సమేతంగా శ్రీవారిని పల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి స్వామివారికి శాస్త్రోక్తంగా ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టీటీడీ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ గణేష్, అర్చకులు నారాయణదాసరి, గోపాల ఆచారి పాల్గొన్నారు.

కిక్కిరిసిన గంగమ్మ ఆలయం



అమ్మవారి సేవలో విజయానందరెడ్డి, భక్తులతో కిక్కిరిసిన ఆలయం

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయకట్టులో ఉన్న ఆరిమాని గంగమ్మ ఆలయానికి భక్తులు సోమవారం పోటెత్తారు. కనుమ పండుగను పురస్కరించుకుని జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అధికారులు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పరీక్షా కేంద్రం పరిశీలన


కళాశాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ విమలకుమారి

పుత్తూరు రూరల్: వెంకటపెరుమాల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలీసు పరీక్ష కేంద్రాన్ని తిరుపతి ఏఎస్పీ విమలకుమారి సోమవారం పరిశీలించారు. ఈ నెల 22 నుంచి పరీక్షలు జరుగుతాయని, ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. ఆమె వెంట పుత్తూరు ఇన్‌చార్జి డీఎస్పీ రామరాజు, సీఐ లక్ష్మీనారాయణ, కళాశాల సిబ్బంది ఉన్నారు.

ముస్తాబైన కొండచుట్టు మండపం


కొండచుట్టు మండపం

నగరి: పట్టణంలో ప్రతి ఏటా కనుమ పండుగకు మరుసటి రోజున గిరిప్రదక్షిణ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో ఎక్కడాలేని విధంగా 21 దేవతల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కొండచుట్టు మండపం వద్దకు తీసుకువస్తారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వాహకులు మండపానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. మండపం చుట్టూ క్యూలైన్లు ఏర్పాటుచేశారు. నగరి పట్టణం చుట్టూ ఉన్న కొండల చుట్టూ ఉన్న దేవతలు కొండను చుట్టుకొని తిరిగి పట్టణానికి చేరుకుంటారు. చింతలపట్టెడ రోడ్డు మలుపు వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మండపం వద్దకు దేవతలను తీసుకువస్తారు. అందువల్ల ఈ మండపాన్ని కొండచుట్టు మండపంగా పిలుచుకుంటారు. ఈ ఉత్సవాలు నిర్వహించడానికి సాలువ రాజులు మండపాన్ని నిర్మించినట్లు శాసనాలను బట్టి తెలుస్తోంది. మండపంలో విఘ్నేశ్వర స్వామిని ప్రతిష్ఠించారు. వారి తరువాత కార్వేటినగరం జమిందార్లు, తదనంతరం పాళేగార్లు మండప నిర్వహణను కొనసాగించారు. ప్రస్తుతం పాళేగార్ వంశస్తుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పండగలకు మనం బంధువులను పిలుచునే రీతిన.. నగరి పట్టణంలోని కరకంటేశ్వర స్వామి సంక్రాంతి పండుగకు దేవతలను ఆహ్వానిస్తారనని ఆయన ఆహ్వానం మేరకు కొండల చుట్టూ వున్న దేవతలు మండపం వద్దకు అతిథులుగా విచ్చేస్తారని, అలా వచ్చిన దేవతలు గ్రామ విశేషాలను మాట్లాడుకుంటారని ప్రతీతి. ఆనవాయితీగా వచ్చే ఈ వేడుకలను చూడడానికి ప్రజలు వేల సంఖ్యలో తరలివస్తారు. నగరి పట్టణంలో జరిగే కొండచుట్టు ఉత్సవాలకు ప్రస్తుతం చుట్టుపక్కల గ్రామాల్లోని 21 దేవతలు వచ్చి కొలువుదీరుతారు. పూర్వం తిరుత్తణి, పళ్లిపట్టు, పుత్తూరు మార్గాల్లో ఉన్న ఆలయాలన్నింటి నుంచి సుమారు 50 దేవతల ప్రతిమలను తీసుకువచ్చేరు. ఉత్సవాలు ముగించుకుని మరుదినం ఉదయాన్నే ఉత్సవ మూర్తులను తీసుక్కెళ్లేవారు. ప్రస్తుతం 21 మంది దేవతలను మాత్రమే తీసుకువస్తున్నారు. పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఈ మండపం చుట్టూ దుకాణాలు ఏర్పాటుచేస్తారు. దీంతో ఇక్కడ తిరనాళ్ల సందడి కనిపిస్తుంది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదు

జిల్లా వ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకున్న నగరి కొండచుట్టు ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని నగరి డీఎస్పీ రవికుమార్ తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. మద్యం సేవించి గొడవలకు దిగే ప్రయత్నం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఎదురుసేవ సంబరం


ఎదురుసేవ మండపం


ఊరేగింపులో స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరునికి సోమవారం సాయంత్రం ఎదురుసేవ కార్యక్రమం సంబరంగా సాగింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదిదంపతుల కల్యాణానికి దేవతా గణాలు, మునులను ఆహ్వానించేందుకు స్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణకు వెళ్లారు. గిరిప్రదక్షిణ ముగించుకుని వచ్చిన స్వామి అమ్మవార్లకు పట్టణ శివారులోని శుకబ్రహ్మాశ్రమం సమీపంలో ఎదురు సేవ మండపం వద్ద భక్తులు ఘన స్వాగతం పలికారు. స్వామి అమ్మవారుల కొద్దిసేపు ఎదురుసేవ మండపంలో సేద తీరారు. అనంతరం స్వామి అమ్మవార్లు ఆలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా గిరిప్రదక్షిణ సందర్భంగా సాధారణంగా అంజూరు మండపం వద్ద వంటలు వండి శ్రీపాదకూలీలు, భక్తులకు వడ్డిస్తారు. అయితే ఈసారి ఆలయం నుంచి వండి తీసుకురావడంతో ఆలస్యమైంది. దీంతో శ్రీపాదకూలీలు, భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. ఇక గిరిప్రదక్షిణకు ఏర్పాటైన కొత్తమార్గం కొద్దిగా ఎగుడు దిగుడుగా ఉండడంతో స్వామి అమ్మవార్లను మోసే వారు కాస్త ఇబ్బంది పడ్డారు.